# బతకలేకపోతున్న బడిపంతులం

"వీరం రాజు"

విద్యార్థుల మందరం ఎండాకాలం సెలవులకు ఇంటికి వచ్చాము. మా గ్రామంలో ఒక ఎలిమెంటరీ స్కూల్ వుంది. ఎండాకాలంలో మేమంతా ఆ బళ్ళో పిల్లల మవుతాము. ఆ స్కూల్లో మా అన్నగారి అల్లుడు మేష్టర్. మద్రాసునుంచివచ్చిన మరుసటిరోజు స్కూల్లో సభదీర్చాం. మేము నలుగురు ఒకచోట జేరితే అన్ని విషయాలు కూలంకషంగా చర్చించాలిసిందే.

మేము స్కూల్లోకి వెళ్ళగానే మాఅల్లుడు "ఓహో! మామగారు! అపూర్వ దర్శనాలు. ఎప్పుడు రాక. మీరెప్పుడొస్తారా, మాస్కూల్ ఎప్పుడు కళకళ లాడుతుందా అని ఎదురు చూస్తున్నాం. ఎండాకాలంలో మీరు మా స్కూల్లో లేకపోతే ఇంక పిల్లలెవరుంటారు" అని సంతోషంతో మమ్మల్ని ఆహ్వానించాడు.

"ఏమయ్యా! అల్లుడూ! నీకేం మహారాజువి కాలుమీద, కాలువేసుకొని, గడప దాటకుండా సంపాదిస్తున్నావు. మేము వేలకువేలు ఖర్చు చేసి యిల్లువాకిళ్లు అమ్ముకుంటున్నాము" అని ప్రారంభించాము మా విక్రమాదిత్య కొలువు కూటంలో.

"మా అదృష్టాన్ని నీలాంటి తెలివి తక్కువ వారు పొగడవలసిందే. మా జీవితంలో యెన్ని కారు మబ్బులు వికటాట్టహాసం చేస్తున్నవో పిచ్చి బాబువు నీకేం తెలుసు. ఏదో బతకలేక బడిపంతులు చేస్తున్నాగాని-"

"అదేమిటయ్యా! అట్లా అంటావు. భావి భారత జాతికి గురుశ్రేష్టులు మీరు. మీరే అభినవ చాణక్యులు, మీరే స్వతంత్ర భారతావని వివేకానందులు."

"ఆపు...మామా...ఆపు. పెద్దపెద్ద విషయాలు దొర్లిస్తున్నావే. గట్టున కూర్చొని యెన్నైనా కమ్మని కబుర్లు చెప్పవచ్చు. దిగితే కాని లోతు తెలియదు. మునిగితేకాని అంతు తెలియదు."

"ఏం కృష్ణా! అట్లా అంటున్నావు. మేమంతా బి. ఏ. ప్యాసయిన తరువాత ఉపాధ్యాయ వృత్తి స్వీకరించి మదనమోహనులము కావాలని కలలు గంటున్నామే. నీ మాటలు మమ్మల్ని నిరుత్సాహపరుస్తున్నవి. మీ సాధక బాధకాలు మాకు కాస్త చెప్పుదూ!"

"ఏం చెప్పనురా... మా పని ఆడపిల్లల తండ్రులలాగా వున్నది. ఏదో ఒక కంచంలో తిని ఒక మంచంమీద పండుకొన్నాము గాబట్టి మీతోనైన చెప్పి నా మనోవ్యథ తీర్చుకోవాలి. ఎంతకాలమని మనస్సులో కుళ్ళి కృశించి, చావమూ!" అని ఆవేశంతో అన్నాడు మా అల్లుడు కృష్ణారావు. వాడి కళ్ళు చెమ్మగిల్లినవి. కళ్ళంబడి నీరు రావటమే తరువాయి. వాడి ముఖం అంతా కందగడ్డలాగా కందింది. పాపం వాడు ఎంత బాధ పడుతున్నాడో అనుకున్నాము మనస్సులో.

కొంతసేపు అంతా మౌనంగా వూరుకున్నాం.

"ఏం చెప్పేదిరా రాజూ. మా అవస్థలు వినే నాథుడెవడున్నాడు. మా కథ వ్రాయాలంటే రామాయణ, మహాభారతాలను మించిపోతుంది. సీతాదేవి కష్టాలు విన్నా గుండె కరుగని కఠినాత్ములుకూడా కంటినీరు పెట్టుకోవలసిందే.

ఎవరు ఎలిమెంటరీ స్కూల్ మాష్టర్లుగా వస్తూన్నారో తెలుసా! యెక్కడా వుద్యోగం దొరకక, ఏ కాలేజీలో సీటుదొరకక, స్కూల్ ఫైనల్ ప్యాసవటం అసంభవం అనుకున్నవారు గాని, కాలేజీలలో చదవలేము అనుకున్నవారు గాని, వ్యాపారం చెయ్యటానికైనా 'చేతన్ లేదోక చిల్లి గవ్వయైనన్' అనువారుగాని వంశ పారంపర్యంగా చదువుల కలవాటుపడి ఏకూలో నాలో చేసుకోటానికి బిడియపడేవారు, మనస్కరించని వారుగాని, తల్లిదండ్రులు సంపాదించిన 'స్థలభాండ శుద్ధి' అయి, భార్య

కాపరానికి వచ్చి సంసారం నెత్తిమీద బడ్డ వారుగాని కాకపోతే ఈ ముండమోపి ఉద్యోగానికి ఎవరొస్తారు."

"కృష్ణా! ఈ కాలంలో బాధలు పడని వారెవరు? మరి గవర్నమెంటువారు మీ జీతాలను ఎక్కువ జేశామని కోశారే."

"ఆ. చేశారు. 'పొరుగింటి పుల్లకూర రుచి' అన్నట్లు కనపడుతుంది మీకు. అన్ని అలవెన్సులతో సహా నెలకు నలభై అయిదు రూపాయలిస్తారు. జీతాలెప్పుడొస్తాయో తెలుసా? జనవరి నెలజీతం జూలైలో."

"అరె! ఎందుకంత ఆలస్యంగా వస్తుంది. గవర్నమెంటు ఆఫీసులన్నిటిలో 5వ తారీఖు లోపలే బట్వాడా చేస్తారే."

"ఎలిమెంటరీ స్కూళ్లు గవర్నమెంటు ఆఫీసులు కావురా రాజూ! 'ఎవరికి బుట్టినబిడ్డ' స్కూల్ మాష్టర్.? ఇడ్లీ కాఫీలు, గారెలు బూరెలు, మైసూర్ పాక్ జాంగ్రీలను ఉద్దరగా తినటానికి అలవాటుపడ్డ ఇన్‌స్పెక్టరులకు, డి. ఇ. ఓ. లకు, జీతాలు ఆరునెలల తర్వాత వస్తే ఈ లోపల మాష్టర్లు ఏం తింటున్నారో ఎట్లా తెలుస్తుంది? నెలాఖరుకు జీతాల బిల్లు పంపిస్తే జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఆఫీసులో అయిపూ మోక్షం లేకుండా నెల రోజులు వుంటవి. అటుపైని డి. ఇ. వో. ఆఫీసుకు వెళ్ళి రెండు నెలలు కాపలా కాస్తవి. తరువాత టి. డి. సి. ఆఫీసులో నెలలతరబడి పడివుంటవి. ఎన్ని రిమైండర్లు వ్రాసుకున్నా దున్నపోతు మీద వర్షం కురిసినట్లే ఆఫీసర్లకు. వీరంతా తొందరగా పనిచేస్తే బిల్లు జీతంగా తయారయి వచ్చేటప్పటికి ఆరునెలలు పడుతుంది. ఈ లోపల ఆకలితో మాష్టర్లు చచ్చిపోతే సైనుగుడ్డ, కట్టె పుల్లల ఖర్చుకొస్తవి" అని గద్గద కంఠంతో చెప్పాడు కృష్ణారావు. అబ్బ! వీడి హృదయం ఒక అగ్నిపర్వతమా, ఏమిటి!

"ఈలోగా ఏంపని చెయ్యాలి?" అని ప్రశ్న వేశాడు మా మరిది సత్యం.

"ఆకులు, అలములు, గడ్డి, కంప. మన కర్మ చాలక మన శాస్త్రజ్ఞులు గడ్డిలో విటమిన్లవీ వున్నవని నిర్ధారణ చేశారట. మన పూర్వ ఋషుల వలెనే మేము గాలినీ, నీటినీ మేసి పిల్లలకు చదువు చెప్పుతాము మన మంత్రిపుంగవులు "ఒక పూట భోజనం మానివెయ్యండి" అని సలహా చెప్పారట. కాని ఆ పిచ్చిమంత్రికి రోజుకు ఒకపూటైనా తిండిలేనని స్కూల్ మాష్టర్లున్నారని చిత్రగుప్తుడు చెప్పలేదేమో."

"గవర్నమెంటు జీతాలు యివ్వకపోతే పల్లె ప్రజలు మీకు అండగా నిలబడరూ! మిమ్మల్నే దేముళ్ళలాగా నెత్తిన పెట్టుకొని కొలుస్తారట గా! పిల్లలకు చదువు చెబుతూంటే ఆమాత్రం ఆదుకోరా."

"పిచ్చిరాజూ! నీవు కృతయుగంలో పుట్టవలసిన వాడివి. నీవు మాంధాతనాటి కబుర్లు చెప్తావేం! పూర్వకాలంలో చదువులు చెప్పి డబ్బు తీసుకునేవారు కారు. విద్య విక్రయించినవాడు మహాపాపి. మా నాన్న చెబుతూండేవాడు. ఆయన పంతులుగారికి ఎప్పుడు ఏది కావాలంటే అది ఇస్తుండేవాడట. మా తాతగారు ఏమనేవారు గాదట. ఆనాటి విద్యార్థుల తల్లిదండ్రులు అటువంటివారు. ఈ నాడో, మాస్టరు వడపప్పు పానకం యిస్తే బళ్ళోకి వస్తామంటారు కుర్రాళ్లు, పంపిస్తామంటారు తల్లిదండ్రులు.

"నేటి గ్రామజీవితం పూర్తిగా తారుమారయింది. ఇంట్లో పిల్లవాడికి జబ్బుచేస్తే పాలు కావాలన్నది నీ కూతురు. మా కుర్రవాళ్ళను పంపాను వాళ్ల ఇండ్లకు. లేవంటే లేవన్నారు. అప్పుడు నేనే స్వయంగా వెళ్ళాను. ప్రతి పచ్చని గడప తొక్కాను. చివరకు ఎవరో ఒక అమ్మ దయదలచి, గిద్దెడు పాలు నాలు గణాలకు పారేసింది.

"ఇంక పోతే ఒక్క గోంగూరకాడ గాని, పచ్చిమిరపకాయ తొక్కైగాని, మజ్జిగబొట్టు గాని, ఏ దడిగినా పూర్ణానుస్వారమే. ఈ నాటి రైతుకు ఎక్కడలేని అత్యాశ పుట్టింది. గడ్డిపోచతోసహా అమ్మి లాభం గడిస్తున్నాడు. ఇంత డబ్బు వస్తున్నా దయాదాక్షిణ్యాలు మచ్చుకైనా కనపడటం లేదు.

"రైతులు సహకరించకుండా, సర్కారు జీతాలు అందకుండా ఎట్లా జీవిస్తున్నారురా మీరు" అని అడిగాను.

"కొన్నికొన్ని విషయాలు చెప్తూంటే మనముండేది మానవలోకమా, రాక్షసలోకమా అనిపిస్తుంది. సవాశేరు ఎండుమెరపకాయలు ఇవ్వటానికి తన ఇంటిచుట్టూ పదిమార్లు తిప్పించుకుంటాడు షావుకారు. సవాపావు తిరగమాత గింజలిచ్చి 'ఎప్పుడిస్తావు. ఎప్పుడిస్తావ'ని ఎక్కడబడితే అక్కడ నిర్మొగమాటంగా, నిలవేసి అడుగుతాడు. ఈ సైంధవులను తప్పించుకోటానికి బజారుకుకూడా ముఖం చూపించటం మానుకున్నాను. గోరుచుట్టుపై రోకలి పోటన్నట్లు ఇంక బియ్యంబాధ వర్ణించటానికి బ్రహ్మతరం గాదు. ఆ యిల్లు ఈ యిల్లు తిరగంగా, తిరగంగా ఏ అమ్మకన్నా దయగలిగితే రూపాయికి ఆరు గిద్దలయితే యిస్తానంటుంది. అదైనా రూపాయి కనిపిస్తేనే. ఇప్పుడు పల్లెటూరిలో ప్రతివస్తువూ ప్రియమే. బస్తీలో పావలావస్తువు పల్లెటూరిలో అర్ధరూపాయ అంటాడు. జీవితం ఎట్లాగడపాలో తోచటంలేదు."

ఈ గాథంతా విన్నతరువాత స్నేహితులమంతా ఒకరిమొగం ఒకరు చూచుకున్నాము. కాలేజీ హాస్టలులో జలసాగా ఖర్చుచేస్తూ తిరిగే మనకేం తెలుస్తుంది. లోకంపోకడ!

కృష్ణారావును ఓదార్చటానికి, "ఎందుకొచ్చిందిరా ఈ వుద్యోగం. ఏదైనా ఇంకొక వృత్తి చూసుకోరాదూ" అన్నాను అల్లుడిబాధలను వినలేక.

నవ్వుతూ "అదే చేస్తే బాగుంటుంది. చిట్టచివరకు కూలివాడుకూడా రోజుకు రెండు రూపాయలు సంపాదించి భార్యాబిడ్డలతో హాయిగా కాలక్షేపం చేస్తాడు. భార్యాభర్తలున్నారంటే నాలుగు కళ్ళు జూస్తారు. మనకేమిటిరా యీ ఖర్మ అనుకుంటున్నా. బీడీ కొట్టు పెట్టుకుంటే ఎందుకూ పనికిరాని రహీమ్ రోజుకు మూడు రూపాయలు కళ్ళజూస్తున్నాడు. ఆరు సంవత్సరాలు పొలం పుట్రా అమ్ముకొని చదివితే సరిగా పొట్టగడవకపోయె. నేనూ ఒక బీడీకొట్టు పెట్టుదునుగాని పూలమ్ముకున్న వూళ్ళో కట్టెలెట్లా అమ్ముకోనా అనే సంకోచం ఏడిపిస్తున్నది."

నాకు కోపం వచ్చింది. కృష్ణారావుకు డబ్బాశ ఎక్కువయింది అనిపించింది. అరే! వీడు ప్రతిమాటకు డబ్బు కావాలంటున్నాడే. గురువృత్తి స్వీకరించినవారికి ఇంత ఆశ అయితే విద్య ఏం చెప్తారా! అనుకున్నాను. ఇంక ఊరుకోలేక,

"నీకు డబ్బు సంపాదించటం ప్రధానమా? ప్రతిమాస్టరూ ట్యూషను చెప్పుకొని డబ్బుపోసుకుంటూంటే. నీ వెందుకట్లా చెయ్యకూడదు" అని అన్నాను ధర్మోద్ధారకునివలె.

పుండుపై కారం చల్లినట్లుగా లేచాడు కృష్ణారావు. "ఒరే, డాబులు పలకటం కాదురా. నాతో ఒక్కవారం రోజులుండి నా పరిస్థితులు సరిదిద్దు. నీవు మనశ్శాంతి పొందగలిగితే చెవ్వు కోయించుకుంటా. మీ నాన్న నెలనెలాపంపే వందరూపాయలు ఖర్చుచేస్తూ మద్రాసంతా తెగతిరగటమనుకున్నావా? ఈమాత్రం కబుర్లు నేనూ చెప్పగలను ఇతరులతో. నీ బోటి డాక్టరొకడు అన్నాడట, "ఇన్ని కంతలు కోశానుగాని, నా కంతంత నొప్పి లేదని" అని ఉక్రోషంతో వీపు చరిచాడు.

"నేనడిగిందానికి సమాధానం చెప్పకుండా నావీపు పగలగొట్టావు."

"ఈ పల్లెటూళ్ళలో ట్యూషన్ చెప్పించుకునే పాపాత్ముడెవరురా. పట్టణాలలో అన్నావు "ఓనమః" చదువుకునే వాడైనా అయిదు రూపాయిలు అవలీలగా యిస్తాడు. కొన్నిరోజులిక్కడవుండు నీకే తెలుస్తవి గమ్మత్తులు"

ఇంతలోకే ఒక రైతు తన కుర్రవాడిని గబగబా ఈడ్చుకుంటూ, కొట్టుకుంటూ, నోట్లోనుంచి రైలు ఇంజన్‌లాగా గుప్పుగుప్పున పొగమా మొహాలమీద విడుస్తూ,

"ఏమయ్యా, పంతులూ మా వాడు ఆరు నెలలు బడిలోకి వచ్చినా ఓనమాలే రావేమయ్యా. ఇదేంచదువయ్యా! ఇదుగో పంతులూ చెప్తున్నా, మా వాణ్ణి వంటేలుకయినా వదలొద్దు. అన్నం ఇక్కడికే తీసుకొచ్చి పెడతా. మీ స్థంభానికి కట్టివేసుకో" అని కూకలేశాడు.

నేనన్నాను, "ఏమయ్యా, రంగయ్యా, వీడు పంతులనుకున్నావా, జంతువనుకున్నావా? మీ కుర్రవాణ్ణి యిరవై నాలుగు గంటలూ ఇక్కడ

వుంచుతానంటే మేస్టరుకు పెళ్ళాం బిడ్డలు లేరంటావా? ముప్పొద్దులూ మీవాడిముందు కూచోమంటావా? పోనీ ఏదైనా ఫీజు యివ్వరాదూ, మేష్టరు చెప్పుతాడుగా?

"ఓహో, భలేవాడివే నే. ఈ పంతులు ఏం చేస్తుంటాడంటా! పనా, పాటా! పిల్లల్ని ముందేసుకొని కూచోక. ఫీజు ఫీజంటయ్యా, సర్కారువారు జీతం యివ్వటంలేదూ. మా వూళ్ళో యీ పిచ్చివేషాలు సాగవు. పంతులు సరిగా చెప్పాడా సరే! లేదా నీవు విమానం మోత మోగుతుంది. తెలిసిందా" అని అనే టప్పటికి నేను తెల్లమొగం వేశాను. మా మిత్రులు గుడ్లు ఒప్పజెప్పారు. ఇప్పుడు కృష్ణారావుబాధలు అర్థమయినవి మాకు. రంగయ్య పోగానే విజేయతలాగా కృష్ణారావు, "ఏంరా! తెలిసిందా... కనీసం ఆకలైనా తీరొద్దూ. ఇంట్లోకిపోతే భార్య 'బియ్యం బియ్యం' అని అష్టోత్తరం జపిస్తుంది. పిల్లలు 'గీ బే' అని కాళ్ళచుట్టూ మూగుతారు. పొట్టలో పొర చుట్టలు పెట్టుకొని, గుడ్లు పీక్కుపోతుంటే కాళ్ళు జివజివ లాగుతూంటే, రెండు కాళ్ళు ముడుచుకొని, గువ్వలాగా కుర్చీలో కూలబడి అన్నపూర్ణ జపం చేసుకుంటూ దైవం ఎప్పుడు చల్లటిచూపు చూస్తాడా అనుకుంటూ, మీన మేషాలు లెక్కపెట్టుకుంటూ కూర్చోక చేసే దేమిటిరా... ఇక చెప్పండి." అన్నాడు విచారంగా.

"మా స్కూలులోకి పిల్లలు వస్తున్నట్లు లేదే." అని అన్నాడు రామమూర్తి అగ్నిలో ఆజ్యం పోసినట్లు.

"అదొక కథ. ఇదివరకు విద్య యందాసక్తి వున్నవారు శ్రద్ధగావచ్చి చదువుకొనే వారు. ఇప్పుడో మన వూరిని కంపల్సరీ ఏరియా క్రిందికి జేర్చారు. ఊళ్ళోవున్న పిల్లల పేర్లు మా రిజష్టరులో తిష్టవేసుకున్నవి. కాని గైరుహాజరు. తల్లిదండ్రులకు పంపిద్దామని ఆసక్తి శ్రద్ధా లేదు. వారు రైతులు గాబట్టి వాళ్ళ పిల్లలను గేదెలు తోలుకెళ్ళమనో, పేడ పోగు చెయ్యమనో, గడ్డి దొక్కరమ్మనో, ఏదోపని చెప్తారు. మేము ఉదయం ఏడు గంటలనుంచి పదకొండు గంటలదాకా పిల్లల్ని తీసుకొనివచ్చేమా, చదువుచెప్పేమా. తొక్కినగడప తొక్కకుండా, కాళ్ళరిగేటట్లు తిరిగితే నూటికి పదిమందైనా రారు. సర్కారువారు జరిమానా వేస్తారని చెప్పితే, "ఏమయ్యా, పంతులూ, జరిమానాగిరిమానా అన్నావా, ఎముకల్లోసున్నం ఉండదు. మేము మోటువాళ్ళం, మా సంగతి తెలియదు గామోలు. నీ కేంపనివుందయ్యా? చేతికి ఎదిగినపిల్ల బళ్ళోకి పంపితే, ఇంటి దగ్గర గొడ్డు గోదను ఎవరు చూస్తారు, పిల్లా జెల్లల్ని ఎవరాడిస్తారు? మేం పొలమెత్తే ఇల్లెవరు కాపలా గాస్తారు. నీవు గాస్తావా? నీ సర్కారు గాస్తుందా? ఏంటయ్యా మాట్లాడవూ. అట్లా చూస్తావేం" అని గదుముతారు. కొందరు, "ఏందయ్యా, అట్లా కొలుగాలిన పిల్లెల్లె తిరుగుతావు. పప్పు బెల్లాలన్నా పెట్టరాదూ?" ఇక పిల్లలేం జేస్తారో తెలుసా. పప్పు బెల్లాలు పంచిపెడతారేమోనని స్కూల్ గడప దాకొవచ్చి తొంగిచూచిపరిగెత్తే వారుకొందరు, 'ఇంకా పెడుతారేమో' అని ఆశచొప్పున ఒక అరగంట వుండి, ఒంటేలుకో, బయలుకో, మంచినీళ్ళకో అని మొగం తప్పించేవారు కొందరు."

"దీనిని గవర్నమెంటు ఏమంటుంది"

"ఏమంటుందా! అప్పుడే పూసిన మల్లెపూలవలె వస్తారు పూల రంగళ్లు ఇన్స్పెక్టర్లు. చచ్చి శాయంగల విన్నపాలయి పిల్లలను పిలుచుకొస్తామనుకో. ఏదైన ప్రశ్న వేస్తే వాళ్ళకేంవచ్చు! అకస్మాత్తుగా వచ్చాడా చచ్చామన్న మాటే! కూర్చున్నా తప్పు పడతాడు, నిల్చున్నా తప్పు పడ్తాడు. పిల్లలు వస్తే నుయ్యి, రాకపోతే గొయ్యి. పిల్లలు స్కూల్ కు వచ్చినా రాకపోయినా, చదువు వచ్చినా రాకపోయినా, ప్రతి సంవత్సరం ప్యాసు అవ్వాలిసిందే! రిజిష్టర్లలో ఓనమాలు రాని వాడైనా 4 వ తరతగతిలో వుండాలసిందే, వాడు నాలుగు సంవత్సరాలనుంచి వస్తూంటే చాలు."

"మీదంతా కాశీమజిలీ కథలావుంది. ఇన్స్పెక్టరుకు ఏం సమాధానం చెప్తావ్."

"ఏముంది! ముప్పొద్దులా ఇంత మృష్టాన్నం పడవెయ్యాలి. బ్రాహ్మణుడైతే గారెలు, ఆవ

డలు, లడ్లు, కాకపోతే కోడిపలావు, సాయిబయితే గొర్రె కైమా. "ఏమయ్యా! పంతులూ స్కూల్ సరిగా నడవటం లేదు. పిల్లలు రావటంలేదు. వచ్చినా చదువు లేదు. మీ స్కూల్‌ను హ్రస్వం చెయ్యాలిసి వస్తుంది. ఏమంటావు" అని ప్రారంభిస్తాడు ఇన్‌స్పెక్టర్. "పొదుగు కోసుకొని పాలు ఎక్కడ తాగం. ముందీ సైతాన్‌ను వదలించుకోవాలంటే వాడి మొహాన ఒక నెల జీతమయినా పారవెయ్యాలి.

లేకపోతే చిన్న పామునైనా పెద్ద కర్రతో కొడతానంటాడు. ఆ నెల జీతమైనా బ్రహ్మ ప్రళయం మీద ఒప్పుకుంటాడు. ఏముంది! పిల్లికి చెల్గాటం. ఎలుకకు ప్రాణసంకటం. పోనీ ఎదురునిల్చి లంచం యివ్వమంటే, అసలే పైస లవుతాం. ఇన్‌స్పెక్టర్ రిపోర్టు వ్రాశాడంటే పైవారు దున్నపోతు ఈనితే దూడ కట్టెయ్యమంటారు. ఈ పీడంతా ఎందుకని, కళ్లు నలుపుకుంటూ పారవేస్తాం. ఆ కాస్తా పడేటప్పటికి రిపోర్టులో సవ్యంగా గీస్తాడు. వీటిని ఆధారం చేసుకొని మన కాంగ్రెసు మంత్రులు మా హయాంలో నూటికి నలభైమంది చదువుకుంటున్నారని గప్పాలు నరుకుతూంటారు."

"సరే అబ్బాయీ! ఇప్పటికే నిన్ను బాధ పెట్టాము. పూరికెవరయినా పెద్దలు వస్తే ఏం చేస్తారు మీరు?" అని చివర ప్రశ్న వేశాను.

"అబ్బో! ఇది చాలా రక్తిగట్టే కథే. మా పూళ్ళోకి ఏ పెద్ద ఆఫీసర్, ప్రెసిడెంటు, ఎం. ఎల్. ఏ. వచ్చినా మా స్కూల్ వారికి విడిది. వారికి లాంఛనాలు మేము జరపవలిసిందే. ప్రజా ప్రభుత్వ విధానము వచ్చింతరువాత మా గోడు వినేదెవ్వడు. బాబో! ఈ బోర్డులెందుకు వచ్చినయ్యో కాని, మా పురమార్తున్నది. మొలతాడుగట్టిన ప్రతి మొగవాడూ, ఓంఅంటే ఢం రాని బయ్యమ్మలంతా, నెత్తిన గవ్వబెడితే కాసు చెయ్యని ఖద్దరుధారులంతా, మేము పంచాయతీబోర్డు ప్రెసిడెంటూ లేకపోతే మెంబరుల మనో, ఎం. ఎల్. ఏ. గారి బావమరిదిననో, మంత్రిగారి వేలువిడిచిన మేనల్లుణ్ణనో, వస్తాడు. వారు వచ్చినప్పటినుంచి మేము అడుగులకు మడుగులొత్తుతూ, జోహుకుం చేస్తూంటే, వాళ్ళ రాజకీయాలను దంచేస్తూంటారు. అంతతో పోతే అదృష్టవంతులమే. కాఫీ అనీ, టిఫిన్ అనీ, సోడా అనీ, కిళ్లీ, సిగరెట్టులనీ ఆర్డరిస్తే మేము తెచ్చిపెట్టాలి. లేకపోతే దెబ్బతిన్న త్రాచులాగా విజిటర్సు పుస్తకంలో ఛడా భడా వ్రాస్తారు. మా రిజిష్టరు చూసి సంతకం పెట్టమూ అంటారు. పొట్టి సంతకమా, పొడుగు సంతకమా, ఎఱ్ఱదా, నల్లదా అంటారు. మాకు నవ్వూ, ఏడ్పూ వస్తవి. మీరుసంతకాలు చెయ్యకూడదండి అంటే వినరు. ఇదీ రాజకీయ వేత్తలతో బాధ"

ఈకథంతా వింటూంటే మాకు నవరసాలూ పుట్టుకొచ్చినవి. భారత భావిసంతతికి గురువులైన ఉపాధ్యాయులకు ఎన్నెన్ని అవమానాలు జరుగుతున్నవో తెలిసింది. నేటి ఉపాధ్యాయుడు కొండంత బరువుక్రింద అణగారిపోతున్నాడు. ఉపాధ్యాయ వృత్తికి గౌరవమే పోయింది. ఇట్లయితే మన భావిసంతతికి విద్య ఎట్లా వస్తుంది? ఎంత కన్నీరు ఎన్ని నిట్టూర్పులు మన ఉపాధ్యాయులకు!

సోవియట్ యూనియన్ నుండి వచ్చిన నిర్వాసులు, శరణార్థులు అమెరికన్ జీవన సరళిని అలవరుచుకోవడానికి ఫోర్డు ధర్మ సంస్థ నిధినుంచి ధనసహాయం చేయబడగలదు. ఆదిలో నిధికి 2,00,000 డాలర్లు కేటాయించబడినవి. అయితే, ఈ ధనం ఇంకా అనేక ధర్మకార్యాలకు ఉద్దేశించబడింది. కాని, ఈ మొత్తం ధనాన్ని రష్యన్ నిర్వాసులకు మాత్రమే సహాయంగా వ్యయపరుచగలమనీ, అందుకై "స్వాతంత్ర రష్యానిధి" అనే పేరుతో దానిని ఏర్పాటు చేశామనీ ఫోర్డు ధర్మ సంస్థవారు ప్రకటించారు. మున్ముందు ఈ నిధికి ఇంకా ధనం యివ్వగలరట కూడా.